# కొన్ని సందర్భాల్లో...

"ఏంటండి బాబూ, ఇంత బరువుంది. ఈ పెట్లో శవం ఏమైనా పెట్టారా?" అన్నాడు రైల్వే పోర్టర్ ఒగరుస్తూ.

"కాదు లేవోయ్" అంటూ తెచ్చిపెట్టుకున్న నవ్వొకటి ప్రదర్శించాను. 'పుస్తకాలు కదా, బరువుంటాయి' అని చేర్చబోయి ఆగిపోయాను. మామూలు పరిస్థితుల్లో అయితే పుస్తకాలనేవి మోస్ట్ హార్మ్‌లెస్ ఆబ్జెక్ట్స్. కానీ పెట్టెలో ఉన్నవి బూతు పుస్తకాలు కాబట్టి ఆ మాట అనలేను. ప్రజల చేతుల్లో పడితే సమాజానికి హాని (ప్రభుత్వం దృష్టిలో), పోలీసుల చేతిలో పడితే నాకు హాని !

ఎస్-7 కోచ్‌లో దాన్ని ఎక్కిస్తూంటే గుమ్మంలోనే టీసీ 'ఇంత పెద్దపెట్టెని బ్రేక్‌వాన్‌లో బుక్ చేయలేకపోయారా?" అన్నాడు మొహం అదోలా పెట్టి.

"టైము లేకపోయిందండి. లోపలిదాకా తీసుకెళ్లక్కర్లేదుగా. ఇక్కడే లగేజ్‌రాక్ దగ్గర పెట్టేస్తా." అన్నాను సంజాయిషీ చెబుతూ.

"అందరూ అలానే అంటారు. చూడండి అప్పుడే ఒకటి అక్కడ పెట్టి ఉంది." అంటూ "అరే, ఆ పెట్టీ మీ దాన్లాగానే ఉందే!" అంటూ ఆశ్చర్యపోయాడు.

"ఆ మధ్య ఎగ్జిబిషన్‌లో హోల్‌సేల్ రేట్లకే అమ్మేరు లెండి. చాలా అమ్ముడుపోయాయి." అన్నాను పోర్టరుకి డబ్బులిస్తూ.

"ఎందుకైనా మంచిది. పెట్టెలు మారిపోకుండా ట్యాగ్ ఒకటి ఇస్తాను. హాండిల్‌కి కట్టండి. ఇందాకా వాళ్లకి ఇచ్చాను. వాళ్లెలా కట్టారో మీరు అలానే కట్టండి." అని సుతారంగా విసుక్కుంటూ బేగ్‌లోంచి దారం కట్టిన అట్టముక్క ఒకటి ఇచ్చాడు.

"థాంక్సండీ. ఎయిర్‌లైన్స్ వాళ్లలా రైల్వే వాళ్లూ మొదలెట్టారా?" అన్నాను ట్యాగ్ అందుకుంటూ.

"డిపార్టుమెంటు వాళ్లు ఇవ్వడం కూడాను. చాల్లెండి. నేను పోగుచేసి ఇస్తున్నాను. ప్రయాణికులందరివీ ఒకలాటి సూట్‌కేసులే. ఇక్కడ పెట్టి తాళం వేసుకోండి అంటే వేసుకోరు. తర్వాత పొరబాటున మరోడు పట్టుకుపోతే కంప్లెయింట్స్ ఇవ్వడానికి మాత్రం తయారవుతారు. మమ్మల్ని పిలిచి స్టేటుమెంట్స్ ఇమ్మంటారు. కాస్త ముందుజాగ్రత్త పడితే ఈ తలకాయనొప్పిలన్నీ తప్పుతాయి కదాని.." అని చెప్పుకొచ్చాడు టీసి. పెద్దాయనే. అనుభవం వల్లనో, ముందుచూపు వల్లనో మంచి జాగ్రత్త తీసుకున్నాడు కానీ నాకు ఇబ్బంది తెచ్చిపెట్టాడు, ఆ పెట్టిని ఎలా వదుల్చుకోవాలా అని నేను చూస్తున్నాను కాబట్టి.

నేను అమ్మే పోర్నోగ్రఫి పుస్తకాలపై పోలీసుల నిఘా గట్టిగా ఉంది. ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రికి ఇవంటే మంటట. వాళ్ల పిల్లలు ఇవి చదివే పాడయిపోయారని గట్టి నమ్మకమట. పుస్తకంతో సహా దొరికితే, నాలుగైదేళ్ల జైలు శిక్ష పడేట్లా చట్టం పాస్ చేసాడు. రాష్ట్రమంతటా పోలీసులు గాలిస్తున్నారు. నా గురించి ఎవరో ఉప్పందించారు లాగుంది. మా ఇంటిమీదకి సోదాకి వస్తున్నారని తెలిసి అవన్నీ ఈ పెట్టెలోకి సర్దుకుని బయటపడ్డాను. రైల్లో కూడా చెకింగ్ కావచ్చన్నారు. హైదరాబాదు దాకా వెళితే స్టేషన్లో చెకింగ్‌లో పట్టుబడవచ్చు. లగేజీ తూచినవాడు, పోర్టరు, టీసీలు సాక్ష్యాలు చెప్పవచ్చు. అందువల్ల పెట్టెని రైలు లగేజీ రాక్‌లోనే వదిలేద్దామనుకున్నాను. అది ఎవరిదో కనిపెట్టి వెతికేసరికి నేను ఉండను కదా. పుస్తకాల విలువ లక్ష రూపాయల కంటే ఎక్కువే. అంత ఖర్చుపెట్టి ప్రింటు చేయించారు. ఆ ఫోటోలు చూస్తూ ఉంటే నిజం మనుష్యులను చూస్తున్నట్టు ఉంటుంది. అయినా ఏం చేస్తాం? జైలు

కెళ్లడం కంటే పుస్తకాలు పారేయడం మేలు. లక్ష మళ్లీ సంపాదించుకోలేకపోలేను.

పెట్టె వదిలేసి పోదామనుకుంటూ ఉంటే ఈ టీసీ ఒకడు తగిలేడు. అట్టమీద పేరు, బెర్తు నెంబరు రాసి దానికి తగిలించమంటూ. పేరు దొంగదే కానీ, బెర్తు నెంబరు నిజందే కదా. హైద్రాబాదు చేరేక పెట్టె స్వంతదారు గురించి వెతికినప్పుడు ఫలానా బెర్తులో ఉన్న మనిషి ఎవరంటే తక్కినవాళ్లు గుర్తులు ఈజీగా చెప్పగలరు. నా ఒడ్డూ, పొడవూ అలాటివి. అది వినగానే పోలీసులు చటుక్కున పోల్చుకోగలరు కూడా – నాకూ, ఈ వ్యాపారానికి ఉన్న లింకు తెలుసు కాబట్టి.

"ఏమిటి సార్, టేగ్ రాసి ముడేయడానికి అంతసేపు పడుతోంది." అంటూ టీసీ దగ్గరకు వస్తున్నాడు. మెరుపులా చక్కటి ఆలోచన వచ్చింది. ఇంకో పెట్టెకు కట్టిన టేగ్ చూసాను. వి.ఆర్.సుంకర అని వుంది. నా పెట్టెకు టేగ్ కడుతున్నట్టు నటిస్తూ టీసీకి అడ్డుగా ఒంగి, ఆ పెట్టె టాగ్ విప్పి నా దానికి కట్టేసి, నేను రాసినది దానికి కట్టేశా!

సీట్లో వచ్చి కూచున్నాను. ప్రాణం హాయిగా ఉంది. ఎదుటి సీట్లలో ఒకాయన, భార్య ఆరేళ్ల కొడుకు కూచుని ఉన్నారు. నా పక్కనున్న ముసలాయన లోకం గురించి తెగ వాపోతున్నాడు. నా ఎదురుగా ఉన్న కుర్రాడు చదువుతున్న కామిక్ పుస్తకం పై నుంచి నాకేసి తదేకంగా చూస్తున్నాడు. ఈ పిల్లలు తమాషా అయినవాళ్లు. పెద్దవాళ్లకు తోచని సంగతులు వీళ్లకు తోస్తాయి. భలే పరిశీలిస్తారు. ఎవరు మంచివాళ్లో, ఎవరు కాదో వాళ్లకి సిక్స్త్ సెన్స్ ఏదో చెబుతుంది లాగుంది. ఈ కుర్రాడి చూపులు నన్ను ఇబ్బంది పెట్టాయి. వాణ్ని కోప్పడదామంటే ఏ కారణం చెప్పి కోప్పడను? దగ్గరకు తీసి మురిపిద్దామంటే నాకు పిల్లలతో అలవాటు లేదు. పెళ్లాం, పిల్లలూ ఉంటే గదా ఇవన్నీ తెలియడానికి. నలభై అయిదేళ్లు వచ్చినా అటువంటి వాటి జోలికి పోలేదు. చట్టం నుంచి తప్పించుకు తిరిగే నాలాటి వాడికి ఇలాటి బంధనాలు ఉండకూడదు. అందువల్ల నేను ఆడవాళ్లతో తిరిగినప్పుడు కూడా స్పష్టంగా చెబుతాను. – 'కడుపూ, కాలూ అంటూ వెంటబడి విసిగిస్తే తన్ని తగిలేస్తాను' అని. మరి వాళ్లకు నా వల్ల పిల్లలు పుట్టారో లేదో తెలియదు కానీ ఇప్పటివరకూ ఎవరూ నా వెంటబడి వేధించలేదు.

నా ఆలోచనల్లో నేనుంటే నా ఆలోచనలు చదవాలని ప్రయత్నిస్తున్నాడులాగుంది ఆ కుర్రవాడు, నా పై నుంచి దృష్టి మరల్చటమే లేదు. అక్కడ కూచోవటం ఇబ్బందిగా తోచింది. లేచి కంపార్టుమెంట్‌లో అటూ, ఇటూ తిరగసాగేను. ఒక కార్నర్‌సీటు ఖాళీగా కనబడింది. ఎదురుగా ఉన్న సీట్లో ఒక పదహారేళ్ల అమ్మాయి ఆడవాళ్ల మేగజైన్ ఒకటి ముందు వేసుకుని కూచుంది కానీ చదవడం లేదు. మౌనంగా రోదిస్తోంది లాగుంది, కళ్ల వెంబడి ధారాపాతంగా కన్నీరు కారుతోంది. మధ్యమధ్యలో కళ్లు తుడుచుకుని అటూ, ఇటూ చూస్తోంది ఎవరూ తనను గమనించటం లేదు కదాని.

వెళ్లి ఆమె ఎదురుగా కూచున్నాను. "ఆ మేగజైన్ ఇలా ఇస్తారా?" అంటూ మాట కలిపేను. కబుర్లలో పెట్టాను క్రమంగా. పేరు హేమ. హైదరాబాదు వెళుతోందిట. బంధువుల ఇంట్లో ఉండి డిగ్రీ చదువుతుందట. సైన్సు అంటే ఇష్టంట. కానీ కంప్యూటర్సంటే అసహ్యంట. చిత్రంగా ఉంది. నెమ్మదిగా అడిగేను. "ఎందుకు ఏడుస్తున్నావ'ని. తన కష్టాలు తనవిట. ఎవరూ తీర్చలేనివిట. చెప్పినా ఎవరూ అర్థం చేసుకోలేరట. మాట చాకచక్యం నా వృత్తి నాకు నేర్పిన కళ. జనరల్ టాపిక్స్ మాట్లాడుతూ ఆమె మనస్సు తేలికపరచాను. ఎట్టకేలకు ముప్పావుగంట సంభాషణ తర్వాత తొలిసారిగా చిరునవ్వు నవ్వింది. నేనూ హమ్మయ్య అనుకున్నాను.

"మిమ్మల్ని చూస్తూంటే నాకు ఎవరు గుర్తొస్తున్నారో చెప్పనా?" అంది కాస్సేపటికి.

"ఎవరు?"

"యూ ఆర్ లైక్ మై ఫాదర్."

"గుడ్."

"నో, బ్యాడ్. ఐ డోంట్‌లైక్ మై ఫాదర్"

"భలేదానివే. 'గన్‌షాట్'లో ప్రకాష్‌రాజ్‌లా మాట్లాడుతున్నావు. తుపాకీ తీసి టపటపా కాల్చేయవు

కదా!" అన్నాను పగలబడి నవ్వుతూ.

ఆమె నవ్వలేదు. "ఏదీ తుపాకీ లేదుగా!" అంది చేతులు తిప్పుతూ.

"అంటే చేతిలో ఉంటే కాల్చేసేదానివేనన్నమాట. తమాషా మాట్లాడుతున్నావు. మీ ఫాదర్ ఏం చేస్తారు?"

"ఏమీ చెయ్యరిప్పుడు. చచ్చిపోయారుగా." అంది.

"ఎప్పుడు?"

"మొన్ననే" అంది ఏడుపు మొదలెడుతూ. ఎందుకో గానీ ఈమెకు మెంటల్ బాలెన్స్ తక్కువని అనిపించింది నాకు మొదటిచూపులో. కానీ ఆమెతో మాట్లాడుతున్నప్పుడు ఆమె తెలివితేటలు గమనించాక నా అభిప్రాయం తప్పనుకున్నాను. ఇప్పుడు తెలుస్తోంది. తండ్రి చావుతో ఆమె తీవ్ర ఆందోళనకు గురయిన స్థితిలో ఉందని. "మరి అమ్మ?" అని అడిగాను.

"లేదు. ఎప్పుడో పోయింది."

"సారీ" అని కాస్సేపు ఊరుకుని, "ఇంతకీ మీ నాన్న అంటే నీకెందుకు ఇష్టం లేదు?" అని అడిగాను.

"మా నాన్న జీవితమే ఒక ఓటమి, ఒక వైఫల్యం. అందుకనే నాకు నచ్చదు. నాకే కాదు, ఆయనకీ నచ్చదు. అందుకని తను ఓడిపోయినప్పుడల్లా ఆ కోపాన్ని మా మీద చూపించేవాడు. పోలీసు కానిస్టేబుల్‌గా చేరాడు. తనకు రావలసిన మెప్పు రాకపోయినా, ప్రమోషన్ రాకపోయినా ఆ తప్పంతా మాదే అన్నట్టు మమ్మల్ని చావగొట్టేవాడు. తను కొట్టిన దెబ్బలకే తమ్ముడు చచ్చిపోయాడు. ఆ బాధతో కుమిలి, కుమిలి అమ్మ పోయింది. వాళ్లిద్దరూ పోయాక ఆ కోపానికి నేను గురయ్యాను."

"అయ్యో పాపం"

"మా నాన్నంటే అందుకే నాకు అసహ్యం. ఓడిపోయేవాళ్లకు దూరంగా ఉండాలి. నేను విజేతగా బతకాలనుకుంటున్నాను. నాన్న చచ్చిపోగానే ఆ ఇల్లు వదిలిపెట్టేసి మిగిలిన అన్ని సామాన్లూ తీసుకుని హైదరాబాదు బయలుదేరాను. అక్కడే చదువుకుని జీవితాన్ని గెలుస్తాను. ఇంతకీ మీరు జీవితంలోకి పైకి వచ్చారా? మా నాన్నలా ఓడిపోయారా?" అని అడిగింది హేమ.

ఏం చెప్పను? నా జీవితమే ఒక రంగులరాట్నం లాటిది. ఒక్కోప్పుడు నాది పై చేయి, ఇంకోప్పుడు పోలీసులది. అయినా ఇప్పటిదాకా కటకటాలు లెక్కపెట్టవలసిన అవసరం పడకుండా మేనేజ్ చేసుకుంటూ వచ్చాను. ఇకముందు ఏమవుతుందో గానీ. కాస్సేపుంటే ఈ అమ్మాయి మీరే ఉద్యోగం చేస్తున్నారని అడుగుతుందేమో! 'ఉండు, నా సీటులో పెట్టిన సామాను జాగ్రత్తగా ఉందో లేదో చూసుకుని వస్తాను' అంటూ నా సీటు దగ్గరికి వచ్చేసాను.

నేను వచ్చి పదినిమిషాలు కూచున్నానో, లేదో ఆ పిల్లాడి చూపులు నన్ను ఇబ్బందిపెట్టసాగాయి. ఆ అమ్మాయి కన్నీళ్లు గుర్తుకు రాసాగాయి. ఒక పోలీసువాడి కూతురిపై నాకింత జాలెందుకు? నాకు కూతురుంటే ఆ వయస్సులో ఉండి ఉంటుందన్న భావన వల్లనా? ఏమో!

నా కాళ్లు ఆమె సీటు వద్దకు నన్ను ఈడ్చుకెళ్లాయి. నన్ను చూడగానే ఆమె మొహం ఇంతయింది. "రండి అంకుల్, ఇడ్లీలు తిందాం. ఇప్పుడే ప్లాట్‌ఫారం మీద కొన్నాను. వేడిగా ఉన్నాయి." అని ఆహ్వానించింది. ఆమెతో కలిసి తింటూ ఉంటే అప్పటిదాకా అనుభవించని పుత్రవాత్సల్యం కలిగింది. "మంచినీళ్లు కావాలి. జగ్ కింద పెట్టాను. తీసి ఇస్తారా?" అంది. జగ్ తీస్తూ ఉంటే కనబడింది. ఆమె పెట్టె మీద ఉన్న పేరు – వి.ఆర్.సుంకర!

తింటూన్న ఇడ్లీ ముక్క గొంతులో పట్టేసింది. ఉక్కిరిబిక్కిరి అయిపోయాను. నేను టాగ్ మార్చేసిన పెట్టె ఈమెదా? అంటే చెకింగ్ అయితే జైలు కెళ్లేది ఈ తల్లీ, తండ్రీ లేని పిల్లా? నేను పన్నిన కుట్ర కారణంగానా? మై గాడ్! ఆమె ఏదో మాట్లాడుతోంది కానీ నాకు బుర్రకేమీ ఎక్కడం లేదు. ఈమె నెలాగైనా రక్షించాలన్నదే నా తాపత్రయం. తినడం అయిపోయాక చేతులు కడుక్కునే నెపంతో వాష్‌బేసిన్ వద్దకు వెళ్లాను. లగేజ్‌రాక్ వద్ద కొంతమంది మనుషులు కూచుని ఉన్నారు. వాళ్లని దబాయించి

టాగ్‌లు మార్చేద్దామన్నా, టీసీ అక్కడే ఎదురుగా కూచున్నాడు. భూతద్దాల కళ్లజోడు వేసుకుని. ఆ తర్వాత నాలుగుసార్లు వెళ్లినా అదే పరిస్థితి. నా గాభరా మరింత కావడానికి కారణం, అప్పుడే ఆగిన స్టేషన్లో పోలీసులు రైలెక్కడం. నేను పారిపోయిన విషయం ఎవరైనా సమాచారం అందిచ్చారేమో. అనుమానంతో అన్ని కంపార్టుమెంటుల్లో ఉన్న పెట్టెలన్నీ తనిఖీ చేస్తారేమో! ఏదో ఒకటి త్వరగా చేయాలి. ఏం చేయాలి?

హేమ దగ్గరకు వచ్చాను. కబుర్లలో పెట్టాను. "మీరేం చేస్తారో చెప్పనేలేదు, అంకుల్!" అంది. అవకాశం దొరకబుచ్చుకున్నాను. "ముందే చెబితే ఖంగారుపడతావని చెప్పలేదు. నేను సైకియాట్రిస్టుని. నీతో మాట్లాడుతూ నీ ధోరణి అంతా గమనించాను. నీకు మెంటల్ డిజార్డర్ కాస్త ఉన్నట్టుగా అనిపిస్తోంది. దానికి నువ్వు పెరిగిన వాతావరణమే కారణం." అన్నాను గంభీరంగా.

"నిజమే, అంకుల్. నాకు ఒక్కోప్పుడు ప్రపంచం మీద కసి పుడుతూంటుంది. కనబడినవల్లా విరిచేయాలనిపిస్తుంది." అని ఒప్పుకుంది.

"అవునా, దానికి గాను నీకొక పరిష్కారం సూచిస్తాను. జాగ్రత్తగా విను. నువ్వు కొత్త చోటుకి వెళుతున్నావు. కొత్త జీవితం ప్రారంభించు. పాత జ్ఞాపకాలను సమాధి చేసేయి. వాటిని వదుల్చుకో."

"ఎలా?" హేమకు కూడా నేను చెప్పినది ఇంట్రస్టింగుగా అనిపించినట్టుంది.

"చూడు. దేన్నైనా సంకేతంగా స్వీకరించాలి. నీ వద్ద నున్న పెద్ద పెట్టె ఉంది చూసావూ, దాన్ని పండోరాస్ బాక్స్ అనుకో. అన్ని కష్టాలకు అదే మూలం. నువ్వు హైదరాబాదు వెళ్లే ముందే వదిలేసుకో. దానితో పీడ విరగడయింది అనే సజెషన్ ఇచ్చుకో. అప్పుడు ఫ్రెష్‌గా..."

"బానే ఉంది. కానీ దాన్ని వదుల్చుకోవడం ఎలా?"

"చెప్తాను. ఇప్పుడు పెద్ద స్టేషన్ వస్తోంది కదా. నేను హెల్ప్ చేస్తాను. పెట్టె బయటకు తీసుకుని వెళ్లిపో. టాక్సీ మాట్లాడుకుని ఆ మూలనున్న వంతెన వద్దకు వెళ్లు. టాక్సీ వాణ్ని పంపించేసి ఆ పెట్టె అలానే నదిలోకి గిరవాటేయ్. రాత్రి కాబట్టి ఎవరికీ కనబడదు. నాకు ఇక్కణ్నుంచి బ్రిజ్ కనబడుతుంది. ఆ చప్పుడు బట్టి పోల్చుకోగలను. ఆ తర్వాత బ్రిజ్ చివర దాకా నడుచుకుని వెళ్లి ఆటో ఎక్కి ఎయిర్‌పోర్టు కెళ్లి విమానం ఎక్కి హైదరాబాదు చేరు. గత జీవితం పూర్తిగా మర్చిపో. నన్ను కూడా."

హేమను ఒప్పించడానికి మరీ కష్టపడనక్కరలేకపోయింది. నా వాక్చాతుర్యం అలాటిది. విమానం ఛార్జీలకు డబ్బు ఇవ్వబోతూ ఉంటే మాత్రం ఒద్దంది. "నా కూతురులాటి దానివి కాబట్టి ఇస్తున్నాను." అన్నాను. 'ఆ మాట అనకండి. ఐ హేట్ మై ఫాదర్' అంది. 'సరేలే, ఫాదర్‌ని మర్చిపో. నన్నూ మర్చిపో' అని చెప్పి నా ప్లాను ప్రకారం హేమను పంపించివేసాను. పెట్టె తీస్తూ ఉంటే టీసీ కళ్లెగరేసాడు. 'బంధువులు వచ్చి వాళ్లింట్లో ఉండమన్నారు. బ్రేక్ జర్నీ చేస్తుందిట.' అన్నాను. పోర్టరు ఎవరూ లేకుండా నేనే పెట్టె నెత్తి మీద పెట్టుకుని పట్టాల మీద నుండి బయటకు దాటించేసాను. ఇన్ని చేసినా వంతెన మీద నుండి పెట్టె పడేసిన శబ్దం వినేదాకా నా మనస్సు కుదుటబడలేదనే చెప్పాలి.

ఆ చప్పుడు వినబడగానే తృప్తిగా వెనక్కి వాలాను. కొన్ని సమయాల్లో మంచిగా ఉండడం కూడా లాభిస్తుంది అనుకున్నాను. ఆ అమ్మాయి మీద ప్రేమతో ఆమెకు ఉపకారం చేసాను. నేనూ లబ్ధి పొందాను. విలన్లలో ఇలాటి ప్రవర్తనను ఏమని వర్ణిస్తారో కవులు? 'రాతిలో తేమ' అనో, 'వాడూ మనిషే' అంటారేమో!

పదినిమిషాల్లోనే టీసీ పిల్చాడు. "పోలీసులు చెకింగ్‌కొచ్చారు సార్. మీ పెట్టెలో ఏముందని అడుగుతున్నారు. తెరిచి చూపించాలట" అంటూ.

"పెట్టె చూసి ఖంగారు పడకండి. మా అమ్మాయి పుస్తకాలు, బట్టలు..." అంటూ మూత తెరిచిన నేను లోపల ముక్కలు ముక్కలుగా నరికిన శవం చూసి నిర్ఘాంతపోయాను.

"సుంకర వెంకట్రావ్ శవం గురూ. డ్యూటీకి రావటం లేదేమిట్రా అనుకున్నాం. ఇదా సంగతి? ఏయ్ మిస్టర్, నువ్వు పోర్నోగ్రఫీ పుస్తకాలు అమ్మే రవీంద్రవే కదూ. అవి పట్టుకునే స్క్వాడ్‌లో వున్న

ఎయిర్‌పోర్టు కెళ్లి విమానం ఎక్కి హైదరాబాదు చేరు. గత జీవితం పూర్తిగా మర్చిపో. నన్ను కూడా."

హేమను ఒప్పించడానికి మరీ కష్టపడనక్కరలేకపోయింది. నా వాక్చాతుర్యం అలాటిది. విమానం ఛార్జీలకు డబ్బు ఇవ్వబోతూ ఉంటే మాత్రం ఒద్దంది. "నా కూతురులాటి దానివి కాబట్టి ఇస్తున్నాను." అన్నాను. 'ఆ మాట అనకండి. ఐ హేట్ మై ఫాదర్' అంది. 'సరేలే, ఫాదర్‌ని మర్చిపో. నన్నూ మర్చిపో' అని చెప్పి నా ప్లాను ప్రకారం హేమను పంపించివేసాను. పెట్టె తీస్తూ ఉంటే టీసీ కళ్లెగరేసాడు. 'బంధువులు వచ్చి వాళ్లింట్లో ఉండమన్నారు. బ్రేక్ జర్నీ చేస్తుందిట.' అన్నాను. పోర్టరు ఎవరూ లేకుండా నేనే పెట్టె నెత్తి మీద పెట్టుకుని పట్టాల మీద నుండి బయటకు దాటించేసాను. ఇన్ని చేసినా వంతెన మీద నుండి పెట్టె పడేసిన శబ్దం వినేదాకా నా మనస్సు కుదుటబడలేదనే చెప్పాలి.

ఆ చప్పుడు వినబడగానే తృప్తిగా వెనక్కి వాలాను. కొన్ని సమయాల్లో మంచిగా ఉండడం కూడా లాభిస్తుంది అనుకున్నాను. ఆ అమ్మాయి మీద ప్రేమతో ఆమెకు ఉపకారం చేసాను. నేనూ లబ్ధి పొందాను. విలన్లలో ఇలాటి ప్రవర్తనను ఏమని వర్ణిస్తారో కవులు? 'రాతిలో తేమ' అనో, 'వాడూ మనిషే' అంటారేమో!

పదినిమిషాల్లోనే టీసీ పిల్చాడు. "పోలీసులు చెకింగ్‌కొచ్చారు సార్. మీ పెట్టెలో ఏముందని అడుగుతున్నారు. తెరిచి చూపించాలట" అంటూ.

"పెట్టె చూసి ఖంగారు పడకండి. మా అమ్మాయి పుస్తకాలు, బట్టలు..." అంటూ మూత తెరిచిన నేను లోపల ముక్కలు ముక్కలుగా నరికిన శవం చూసి నిర్ఘాంతపోయాను.

"సుంకర వెంకట్రావ్ శవం గురూ. డ్యూటీకి రావటం లేదేమిట్రా అనుకున్నాం. ఇదా సంగతి? ఏయ్ మిస్టర్, నువ్వు పోర్నోగ్రఫీ పుస్తకాలు అమ్మే రవీంద్రవే కదూ. అవి పట్టుకునే స్క్వాడ్‌లో వున్న వెంకట్రావ్‌ని చంపేసావా? నిన్ను రెడ్‌హేండెడ్‌గా పట్టుకుని ఉంటాడు. నువ్వు చంపేసి, పెట్టెలో పట్టుకుని రైలెక్కేసావు. అవకాశం చూసి పెట్టె వదిలేసి పారిపోదామని నీ ప్లాను. మా కొలీగ్‌ని దారుణంగా నరికి చంపినవాణ్ని వదులుతామా? ఉరికంబం ఎక్కించమూ?" అంటూ రంకెలు వేస్తున్నాడు ఆ లావుగా ఉన్న పోలీసు.

నేనేం జవాబు చెప్పగలను? కొన్ని సమయాల్లో మంచి చేయడం కూడా మంచిది కాదని అనుకోవడం తప్పు!